నేడు విద్యుత్ సరఫరా బంద్

మల్కాజిగిరి: ఆనంద్‌బాగ్ సబ్‌స్టేషన్ పరిధిలో 11 కేవీ ఆర్‌కే నగర్ ఫీడర్ పరిధిలో బుధవారం మరమ్మతుల కారణంగా ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఆర్‌కె.నగర్, చాణుక్యపురి తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ శ్రీనివాసులు, లైన్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు తెలిపారు.

త్రివేణి పాఠశాలలో సంక్రాంతి సంబరాలు



అల్వాల్: అల్వాల్ త్రివేణి పాఠశాలలో మంగళవారం సంక్రాంతి సంబరాలను వైభవంగా నిర్వహించారు. విద్యార్థుల తల్లులు ఉత్సాహంగా పాల్గొని సంక్రాంతి పండుగ విషయాలను తెలిపే అందమైన ముగ్గులు వేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుధ, సీఆర్‌వో వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

కేలండర్ ఆవిష్కరణ



బోడుప్పల్: బృందావన్ కాలనీలోని జేజీఆర్ ఉన్నత పాఠశాల యాజమాన్యం రూపొందించిన కేలండర్‌ను మంగళవారం విద్యార్థులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ గంగరాజు మాట్లాడుతూ దేవుడి ఫొటోలు, ముఖ్యమైన సమాచారంతో రూపొందించిన ఈ కేలండర్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థులకు కేలండర్‌ను ఉచితంగా అందజేసినట్లు వెల్లడించారు. పాఠశాల ఇన్‌చార్జి విజయకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా యువజనోత్సవ ర్యాలీ



రామంతాపూర్: అఖిల భారత విద్యార్థి పరిషత్ రామంతాపూర్ నగర శాఖ ఆధ్వర్యంలో మంగళవారం స్వామి వివేకానంద జయంతి ఉత్సవాల్లో భాగంగా యువజనోత్సవ ర్యాలీని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఏబీవీపీ రామంతాపూర్ శాఖ కార్యదర్శి లోకేష్, ఎల్బీనగర్ విభాగ్ కన్వీనర్ శ్యామ్‌కిరణ్, బుర్ర అఖిల్, సిద్ధు, నరసింహ, జస్వంత్, నవీన్, విజయ్, సంతోష్, శ్రీనివాస్, వినయ్, సంతు, ప్రవీణ్, శివ, కార్తీక్‌తో పాటు వివిధ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులపై అలసత్వం వద్దు



మాట్లాడుతున్న డీసీ శ్రీనివాస్‌రెడ్డి

అల్వాల్: జీహెచ్ఎంసీ అల్వాల్ సర్కిల్ కార్యాలయంలో మంగళవారం డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులపై సమావేశం నిర్వహించి చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పారిశుద్ధ్య పనులపై అలసత్వం వహించవద్దన్నారు. అల్వాల్ సర్కిల్ పరిధిలో పారిశుద్ధ్య కార్మికులు సకాలంలో తమ విధులను నిర్వహించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎంహెచ్‌వో మంజుల, ఎస్ఎస్ ప్రభాకర్, ఏఎస్ఏలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్కూల్‌లో సమస్యలను పరిష్కరిస్తా

మల్లాపూర్: నాచారం వెస్లీ స్కూల్(ప్రభుత్వ ఎయిడెడ్) పాఠశాలను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి ఆయన మధ్యాహ్న భోజనం చేశారు. విద్యార్థులను అడిగి పాఠశాలలోని సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమస్యలను పరిష్కరించి వసతులు కల్పిస్తానని హామీ ఇచ్చారు. విద్యార్థులు రెగ్యూలర్‌గా పాఠశాలకు వచ్చేవిధంగా ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు, నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాజ్యలక్ష్మి, కోటేశ్వర్‌రావు, స్థానిక నేతలు తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో అభివృద్ధి పనులను పూర్తిచేయాలి



ఉప్పల్ భరత్‌నగర్‌లో పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ రజిత పరమేశ్వర్‌రెడ్డి

ఉప్పల్: అభివృద్ధి పనులను సకాలంలో పూర్తిచేయాలని ఉప్పల్ డివిజన్ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్‌రెడ్డి అధికారులకు సూచించారు. డివిజన్ పరిధిలో భరత్‌నగర్‌లో డ్రైనేజీ పైపులైన్ పనులు నత్తనడకన సాగుతున్నాయన్న సమాచారంతో మంగళవారం అక్కడికి చేరుకున్న రజిత స్థానికులతో కలిసి పనులను పరిశీలించారు. వెంటనే అధికారులకు ఫోన్ చేసి డ్రైనేజీ పైపులైన్ పనుల్లో జరిగే సాంకేతిక సమస్యలను అడిగి తెలుసుకుని వెంటనే పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో సాల భిక్షపతి, మేళ సత్తయ్య, మంగ నాగరాజ్, రవిగుప్తా పాల్గొన్నారు.

బాలికపై లైంగికదాడికి పాల్పడ్డ వ్యక్తికి జీవిత ఖైదు

కుషాయిగూడ: మైనర్ బాలికపై లైంగికదాడికి పాల్పడ్డ నిందితుడికి జీవిత ఖైదు, రూ.11 వేల జరిమానా విధిస్తూ మల్కాజిగిరి పోక్సో కోర్టు న్యాయమూర్తి మంగళవారం తీర్పు వెలువరించారు. బాధితురాలికి ప్రభుత్వం రూ.7 లక్షల పరిహారం ఇవ్వాలని ఆదేశించారు. 2015లో వాయుపురికి చెందిన గుర్రాల ప్రభాకర్(38) మైనర్ బాలికపై లైంగికదాడికి పాల్పడ్డాడు. అప్పట్లో సీఐగా ఉన్న ప్రస్తుత అడిషనల్ డీసీపీ వెంకటరమణ ఈ కేసు నమోదు చేసి నేరాభియోగపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా కోర్టు పైవిధంగా తీర్పు వెలువరించింది.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి

బీబీనగర్: ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండల కేంద్రంలో చోటు చేసుకుంది. నగరంలోని పాత అల్వాల్‌లోని చంద్రాపూర్ కాలనీకి చెందిన గంధ్ర సుమంత్(40) సోమవారం భువనగిరికి స్కూటీపై వచ్చాడు. పని ముగిసిన తర్వాత రాత్రి తిరిగి వెళ్తుండగా మార్గమధ్యలో బీబీనగర్ మండల కేంద్రంలోని మాధవరెడ్డి చౌరస్తా వద్ద వెనుక నుంచి వస్తున్న వరంగల్ డిపోనకు చెందిన సూపర్ లగ్జరీ బస్సు అదుపు తప్పి స్కూటీని ఢీకొట్టింది. దీంతో సుమంత్‌కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని భువనగిరి ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి సుగుణాకర్‌రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ యుగేందర్ తెలిపారు.

సంక్రాంతికి ఊరెళ్తున్నారా..
జాగ్రత్త

చోరీలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోండి

- పోలీసుల సూచనలు తప్పకుండా పాటించాలి
- అన్ని ప్రాంతాల్లో మరింత గస్తీ పెంచుతాం..
- అనుమానం వస్తే 100కు డయల్ చేయండి



ప్రచారం ఆటోను ప్రారంభిస్తున్న సీఐ మహేందర్‌రెడ్డి, డీఐ వెంకటేశ్వర్లు

ఘట్‌కేసర్: సంక్రాంతి వేడుకలను సొంతూరిలో సరదాగా జరుపుకునేందుకు చాలామంది ఆసక్తి చూపుతుంటారు. పట్టణాల్లో ఉంటున్న వారు పిల్లాపాపలతో సొంత గ్రామాలకు పయనమవుతుంటారు. అదను చూసుకొని చోరులు చేతివాటం చూపుతుంటారు. ప్రధానంగా తాళం వేసి ఉన్న ఇళ్లు, దూరంగా ఉన్న కాలనీలోని ఇళ్లను లక్ష్యంగా చేసుకొని చోరీలు చేస్తుంటారు. మేడ్చల్ నియోజకవర్గంలో మేడ్చల్, గుండ్లపోచంపల్లి, ఘట్‌కేసర్, కీసర, నాగారం, పోచారంకు విద్య, ఉపాధి కోసం వచ్చి నివాసం ఉంటారు. ఈ నెల 15న జరుగనున్న సంక్రాంతి పండుగకు ఊరికి వెళ్లేవారు అప్రమత్తంగా ఉండాలని, పోలీసుల సూచనలు పాటించాలని సూచిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఘట్‌కేసర్ సీఐ మహేందర్‌రెడ్డి ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రచార ఆటోను మంగళవారం ప్రారంభించారు.

పోలీస్ శాఖ సూచనలు..

ఇంటిల్లిపాది ఇతర ప్రాంతాలకు వెళ్లేప్పుడు మన ఇంటి పరిసరాలను గమనించాలని పక్కింటి వారికి తెలిపాలి. వాహనాలకు వీల్‌లాక్‌తో పాటు హ్యాండ్ లాక్ చేయాలి. ఇంటికి సెంట్రల్ లాక్ సిస్టమ్‌ను బిగించుకోవాలి. ఇంటి లోపలి ద్వారాలు, కిటికీలకు గడియా పెట్టాలి. తాళం కనిపించకుండా కర్టెన్లు వేయాలి. ఇంటి లోపల ఓ లైట్ వెలిగేలా చూడాలి. విలువైన వస్తువులు, ఆర్థిక విషయాలు, ఆభరణాల గురించి ఇతరులకు చెప్పకూడదు. పేపర్ బాయ్, పాలవాడిని రావొద్దని చెప్పాలి. ప్రధాన ద్వారం ముందు గ్రిల్స్ ఏర్పాటు చేసుకోవాలి. బయటి గేటుకు తాళం వేయకూడదు. ఇంటి ముందు చెప్పులు పెట్టండి. బీరువాలో ఆభరణాలు, నగదు ఉంచవద్దు. బయటకు వెళ్లినప్పుడు, ముగ్గులు వేసేటప్పుడు మెడలో బంగారు ఆభరణాలు జాగ్రత్త. నమ్మకమైన వారికి, పీఎస్‌లో సమాచారం ఇవ్వాలి.



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

పండుగకు గస్తీ పెంచుతాం..



మధ్ది మహేందర్‌రెడ్డి, సర్కిల్ ఇన్‌స్పెక్టర్

పండుగకు ఊరెళ్లిన వారు పోలీసుల సూచనలు పాటించాలి. కాలనీలో కొత్త వ్యక్తులు అనుమానాస్పదంగా తిరుగుతుంటే పోలీసులకు సమాచారం ఇవ్వండి. పండుగకు పోలీసులు గస్తీని పెంచుతాం. ఏమైనా అనుమానం వస్తే టోల్ ఫ్రీ నంబర్ 100కు డయల్ చేయండి. స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వండి.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కీసర: సంక్రాంతి పండగ సందర్భంగా గ్రామాలకు వెళ్లేవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కీసర సీఐ వెంకటయ్య కోరారు. మంగళవారం నాగారం మున్సిపాలిటీలో పండగ సందర్భంగా జరిగే దొంగతనాలపై ప్రజలకు పోలీసులు అవగాహన కల్పించారు. మైకులతో ప్రకటన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇళ్లకు తాళాలు వేసి దూరప్రాంతాలకు వెళ్లే ప్రజలు పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కౌన్సిలర్ శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మల్కాజిగిరి అభివృద్ధికి సహకరించాలి

జోనల్ కమిషనర్‌ను కలిసిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి



జోనల్ కమిషనర్‌తో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్ సబిత

అల్వాల్: మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి మంగళవారం కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అభిలాష అభినవ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మల్కాజిగిరి నియోజకవర్గంలో సమస్యల పరిష్కారానికి కృషి చేసి సమగ్రాభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూడాలని, అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు వేగంగా జరిగేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో వెంకటాపురం కార్పొరేటర్ సబితాఅనిల్‌కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు అభయ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

కుషాయిగూడ: సంక్రాంతి పండగ సందర్భంగా అభయ అసోసియేషన్ ఫర్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ ఉమెన్ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ముగ్గుల పోటీలను నిర్వహిస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు ఓ ప్రకటనలో తెలిపారు. చక్రిపురం డొమినోస్ పిజ్జా పక్కన హరి సులోచన ప్లాజాలో ఉదయం 10 గంటలకు జరిగే ఈ పోటీల్లో పాల్గొనే మహిళలు ఫోన్: 89782 08945, 79812 39049 సంప్రదించాలన్నారు. అందరికీ కన్సోలేషన్స్ బహుమతులతో పాటు మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేస్తామన్నారు.

గత ఎన్నికల్లో ఓటరు స్లిప్పుల పంపిణీలో నిర్లక్ష్యం



జాయింట్ చీఫ్ ఎలక్షన్ ఆఫీసర్‌తో వాసవీనగర్‌వాసులు

అల్వాల్: అల్వాల్ డివిజన్ వాసవీనగర్ కాలనీవాసులు మంగళవారం జాయింట్ చీఫ్ ఎలక్షన్ ఆఫీసర్ సర్ఫరాజ్ అహ్మద్‌ను కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో ఓటరు స్లిప్పుల పంపిణీ సరిగ్గా జరగలేదని, ఒకే కుటుంబంలోని సభ్యులు వేర్వేరు పోలింగ్ బూత్‌లలో ఓటు వేశారని, మృతిచెందిన లేదా వేరే స్థలంలోకి మారినా వారిని లిస్టు నుంచి తొలగించలేదన్నారు. దీంతో పోలింగ్ 60 శాతం కూడా జరగలేదన్నారు. ఈ విషయాలను గ్రహించి పరిష్కరించే విధంగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో లక్ష్మణ్‌రావు, పెద్ది రమేష్, వెంకటేశ్వర్లు, పద్మాచారి, బాల గంగాధర్‌రావు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ



గౌతంనగర్: డివిజన్ పరిధిలోని సంతోష్‌నగర్‌లో షికారి శ్రవణ్‌యాదవ్ నివాసంలో మంగళవారం అయ్యప్ప పూడిపూజ ఘనంగా నిర్వహించారు. శ్రీసాయి క్యాటరింగ్ నిర్వాహకులు వై. శ్రీనివాస్, చిన్న గురుస్వామిల భజన బృందం ఆలపించిన అయ్యప్ప భక్తి గీతాలు ఆకట్టుకున్నారు. అనంతరం స్వాములకు సామూహిక అన్నదానం జరిగింది. కార్యక్రమంలో షికారి నవీన్‌యాదవ్, షికారి అరవింద్‌యాదవ్, అయ్యప్ప స్వాములు, భక్తులు పాల్గొన్నారు.

ఏ సమస్య ఉన్నా వెంటనే పరిష్కరిస్తున్నాం



చిలుకానగర్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ తదితరులు

ఉప్పల్: చిలుకానగర్ డివిజన్‌లోని సమస్యలపై స్థానికుల ఫిర్యాదు మేరకు మంగళవారం చిలుకానగర్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ స్థానికులతో కలిసి కాలనీలు, బస్తీల్లో పర్యటించారు. ఇంటింటికీ తిరిగి స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. న్యూరాంనగర్ తదితర ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డివిజన్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు తెలిపారు. ఏ సమస్య ఉన్నా వెంటనే అక్కడికి చేరుకుని సమస్యలను పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ బీఆర్ఎస్ నాయకులు బన్నాల ప్రవీణ్, కొండల్‌రెడ్డి, బింగి శ్రీనివాస్, బోల్లం లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

అత్తింటి వేధింపులతో గృహిణి ఆత్మహత్య



కుమారుడితో భబిత(ఫైల్)

అల్వాల్: అత్తింటి వేదింపులు తాళలేక గృహిణి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కానాజిగూడ ఇందిరానగర్‌లో నివసించే రామకృష్ణ ప్రైవేట్ ఉద్యోగి. భార్య భబిత, కుమారుడితో కలిసి నివసిస్తున్నారు. రామకృష్ణ సోమవారం ఉద్యోగానికి వెళ్లగా మధ్యాహ్నం భబిత ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. భర్త రామకృష్ణ వేదింపుల వల్లే ఆత్మహత్యకు పాల్పడిందని ఆమె కుటుంబసభ్యులు రామకృష్ణ ఇంటి ముందు ఆందోళన నిర్వహించారు. రామకృష్ణను అరెస్ట్ చేసి శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

కొమురవెల్లి చైర్మన్‌కు సత్కారం



పర్పటకం లక్ష్మారెడ్డిని అభినందిస్తున్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

కుషాయిగూడ: కొమురవెల్లి దేవస్థానం చైర్మన్‌గా నియమితులైన చర్లపల్లి డివిజన్ వీఎన్‌రెడ్డినగర్ కాలనీకి చెందిన పర్పటకం లక్ష్మారెడ్డిని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అభినందించారు. మంగళవారం బీఎల్ఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఆయనను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు బీఆర్ఎస్ నేతలు బండారి నీలంరెడ్డి, సప్పిడి శ్రీనివాస్‌రెడ్డి, కాసం మహిపాల్‌రెడ్డి, నేమూరి మహేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్ సంఘం కేలండర్ ఆవిష్కరణ

అల్వాల్: యాప్రాల్ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సరం క్యాలెండర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో నీలం శ్రీనివాస్, తోట సురేందర్, తల్లారి శ్రీకాంత్, ఫలరాంబండి మధు, ఆంజనేయులు, యాప్రాల్ ముదిరాజ్ సంఘం అధ్యక్షులు కావలి చంద్రశేఖర్, చక్కల శంకర్, సాయిబాబా, చంద్రయ్య, కనకరాజు, శ్రీరాం, శ్రీధర్, నరేష్, ఆనంద్ పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలేకి నివాళి



మల్కాజిగిరి: తెలంగాణ విశ్వబ్రాహ్మణ మహిళా సమితి అధ్యక్షురాలు సువర్ణ ఆధ్వర్యంలో మంగళవారం మల్కాజిగిరి వసంతపురి కాలనీలో సావిత్రి బాయి పూలే జయంతి వేడుకలను నిర్వహించారు. ఓబీసీ జాతీయ చైర్‌పర్సన్ భాగ్యలక్ష్మీ హాజరై ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అంబిక, నాగమణి, రజిని, వరలక్ష్మీ, నీలమ్మ తదితులు పాల్గొన్నారు.

మల్లాపూర్ రెడ్డి సంఘం కేలండర్ ఆవిష్కరణ



కేలండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి

మల్లాపూర్: మల్లాపూర్ రెడ్డి సంఘం నూతన సంవత్సరం కేలండర్‌ను మంగళవారం సంఘం కార్యాలయంలో స్థానిక కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డితో కలిసి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద రెడ్డి విద్యార్థులకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని తెలిపారు. సంఘం అభివృద్ధికి పాటు పడతానని పేర్కొన్నారు. కార్యక్రమంలో అధ్యక్షులు దోమ శ్రీనివాస్‌రెడ్డి, గుడి గోపురం ముత్యంరెడ్డి, ఆలేటి భాస్కర్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, రాంరెడ్డి, తిరుపతిరెడ్డి, నర్సిరెడ్డి, మల్లారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, జానార్దన్‌రెడ్డి, రజినీకాంత్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, రాజిరెడ్డి, కొత్త మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్య, వైద్యం ఉచితంగా అందించాలి



ఉచిత విద్య, వైద్యం అందించాలంటూ ప్రదర్శన

కుషాయిగూడ: ప్రభుత్వాలు ఉచిత పథకాలకు స్వస్తి పలికి విద్య, వైద్యం ఉచితంగా అందించాలని కోరుతూ విద్యార్థుల రాజకీయ పార్టీ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఉచిత విద్య, వైద్యం అందించాలని కోరుతూ మంగళవారం ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల రాజకీయ పార్టీల ప్రముఖులు మాట్లాడుతూ ఉచిత పథకాలతో అప్పుల పాలు కావడం తప్పా ఒరిగేదేమీ లేదన్నారు. ఉచిత పథకాలకు స్వస్థ పలికి ప్రభుత్వాలు నాణ్యమైన విద్య, వైద్యం ఉచితంగా అందించాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థుల రాజకీయ పార్టీ ఫౌండర్ సునీల్, గ్రేటర్ అధ్యక్షుడు సుఖేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

రేణుకా ఎల్లమ్మ ఆలయంలో పూజలు



రేణుకా ఎల్లమ్మ ఆలయంలో పూజల్లో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

మల్లాపూర్: నాచారం రాఘవేంద్రనగర్ కాలనీలోని శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఎన్నికలకు ముందు ఎల్లమ్మ ఆలయంలో మొక్కుకున్నారు. భారీ మెజార్టీతో గెలుపొందడంతో బుధవారం మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో నాచారం డివిజన్ కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్, ఆలయ కమిటీ సభ్యులు సీఎస్ మల్లేష్, రాంరెడ్డి, సత్తయ్య, ముత్యం రెడ్డి, యాదగిరి, అశ్వత్థామరెడ్డి, కట్ట బుచ్చన్నగౌడ్, సంజన్న తదితరులు ఉన్నారు.

నియామకం



లక్ష్మణ్, శ్రీనివాసశర్మను అభినందిస్తున్న ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్

ఉప్పల్: సెన్సార్ బోర్డు సలహా మండలి సభ్యులుగా ఉప్పల్‌కు చెందిన సీనియర్ బీజేపీ నాయకులు మహంకాళి లక్ష్మణ్, గొంగుళూరి శ్రీనివాసశర్మను నియమించారు. ఈ మేరకు మినిస్ట్రీ ఆఫ్ ఇన్ఫర్మేషన్ అండ్ బ్రాడ్‌కాస్టింగ్ ఉత్తర్వులను జారీ చేశారు. ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ మంగళవారం వారికి శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు గొరిగే కృష్ణ, దేవసాని బాలచందర్, రావుల బాలకృష్ణ, దేవేందర్ రెడ్డి, గోనె శ్రీకాంత్ ముదిరాజ్ పాల్గొన్నారు.

ఆర్‌యూబీలు నిర్మించాలని రైల్వే అధికారులకు వినతి



రైల్వే అధికారితో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

అల్వాల్: మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి మంగళవారం సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో దక్షిణ మధ్య రైల్వే అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మల్కాజిగిరి నియోజకవర్గంలో వివిధ రైల్వే క్రాసింగ్‌లలో ఆర్‌యూబీలు నిర్మించాలన్నారు. హైదరాబాద్ డివిజన్ పరిధిలో వచ్చే మల్కాజిగిరి ఆర్‌యూబీలు మౌలాలి(ఉప్పర్‌గూడ), గౌతంనగర్, కాకతీయనగర్, వినాయక్‌నగర్, మౌలాలి రైల్వే స్టేషన్, వాజ్‌పేయ్‌నగర్‌తో పాటు సికింద్రాబాద్ డివిజన్ పరిధిలోకి చెందిన అల్వాల్ సర్కిల్‌లోని లయోలా కాలేజ్, సుచిత్ర, మచ్చబొల్లారం తదితర ప్రాంతాల్లో ఆర్‌యూబీల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని హైదరాబాద్ డివిజన్ రైల్వే మేనేజర్ లోకేష్ విష్ణోయ్, సికింద్రాబాద్ డివిజన్ మేనేజర్ సురేష్‌బాబుకు వినతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు చింతల శాంతి శ్రీనివాస్‌రెడ్డి, మురుగేష్, ఈఈ గోపాల్, డిప్యూటీ ఈఈ సుదర్శన్, డీఈ.రాంచందర్, వాటర్ వర్క్స్ ఏఈ దీపక్ తదితరులు ఉన్నారు.

ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కార్పొరేటర్ ప్రభుదాస్

కుషాయిగూడ: డివిజన్‌లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై మంగళవారం మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ కార్పొరేటర్ ప్రభుదాస్ వార్డు కార్యాలయంలో ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. డివిజన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనుల తీరు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించారు. డివిజన్ పరిధిలోని హెచ్‌బీకాలనీ, తిరుమలనగర్, మంగాపురం కాలనీల్లో నూతన సీసీ రోడ్డు పనులను త్వరగా పూర్తిచేయాలని సూచించారు. పనుల్లో నాణ్యత పాటించేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డీఈ స్వరూప, ఏఈ స్రవంతి, వర్క్ ఇన్‌స్పెక్టర్ చారి తదితరులు పాల్గొన్నారు.